సాక్షి
కుమురం భీం
బుధవారం ׀ 18 ׀ జూన్ ׀ 2025



అడ్రస్ లేని అత్యవసర సేవలు
ప్రసిద్ధిగాంచిన సరస్వతీ మాత ఆలయం, ట్రిపుల్ ఐటీ బాసరలోనే ఉన్నాయి. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్యసేవలు అందడం లేదు. 8లో▸



జీవో 49 వెంటనే రద్దు చేయాలి
జీవో 49 రద్దు చేయాలని బీజేపీ నాయకులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఏకపక్షంగా జీవో జారీ చేశారని ఆరోపించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.3 /28.4
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యా సదస్సుకు సుందిళ్ల రమేశ్ ఎంపిక



సుందిళ్ల రమేశ్

కాగజ్‌నగర్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరులో ఈ నెల 19న రాష్ట్ర విద్యాశాఖ, సలహా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మేథోమదన విద్యా సదస్సుకు కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుందిళ్ల రమేశ్ వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారు. విప్లవాత్మకమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ సదస్సుకు ఎంపిక చేసింది.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన శ్యాంనాయక్



జూపల్లి కృష్ణారావును శాలువాతో సన్మానిస్తున్న జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఇటీవల నియామకమైన జూపల్లి కృష్ణారావును మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఆదివాసీ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, నాయకులు సుదర్శన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మరింత ప్రగతి సాధించాలి



సావర్‌ఖేడాలో విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న డీఈవో యాదయ్య

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులు మరింత ప్రగతి సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. మండలంలోని జెడ్పీఎస్ఎస్ కెరమెరి, ఝరి, పీఎస్ సుల్తాన్‌గూడ, భవిత కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఆయా పాఠశాల విద్యార్థులతో బోర్డుపై అక్షరాలు రాయించారు. పుస్తకాలు చదివించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంలో పదాలు చదవడం, రాయడం రావాలన్నారు. సావర్‌ఖేడా పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని చుక్కరామయ్య విద్యాసంస్థల్లో సీటు సాధించడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఆయన వెంట ఎంఈవో ఆడే ప్రకాశ్, కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్ఎంలు చంద్రశేఖర్, భరత్‌కుమార్, హెచ్ఎం కడేర్ల రంగయ్య తదితరులు ఉన్నారు.

ఏరియాలో యోగా శిబిరాలు



ఖైరిగూడ ఓసీపీలో యోగా సాధన చేస్తున్న సింగరేణి ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లలో వారం రోజులపాటు యోగా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జీఎం విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఖైరిగూడ ఓసీపీ, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, గోలేటి సీహెచ్‌పీ, ఏరియా ఆస్పత్రిలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు యోగా సాధన చేశారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులతో కలిసి జీఎం యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో పనిచేసే ఉద్యోగులంతా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం కె.రాజమల్లు, అధికారుల సంఘం నాయకులు ఉజ్వల్ కుమార్ బెహారా, ఏరియా ఇంజినీర్ రామనాథం, డీజీఎంలు ఎస్కే మదీనా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఏరియా సర్వే అధికారి అప్సర్ పాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ మహిళలే టార్గెట్!



- పోలీసుల అదుపులో మానవ అక్రమ రవాణా ముఠా?
- తొమ్మిది మందిపై కేసు
- నిందితుల్లో ఆసిఫాబాద్‌కు చెందిన ఓ కానిస్టేబుల్
- బాధిత మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి..
- దర్యాప్తు కోసం మధ్యప్రదేశ్‌కు ప్రత్యేక బృందం
- నేడో, రేపో అరెస్టు చూపనున్న జిల్లా పోలీసులు

సాక్షి, ఆసిఫాబాద్: ఏజెన్సీ ప్రాంతాల మహిళలకు మాయమాటలు చెప్పి 'మానవ అక్రమ రవాణా'కు పాల్పడుతున్న ముఠా సభ్యులను జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్‌కు చెందిన ఈ ముఠా సభ్యులు మహబూబాబాద్ జిల్లా రేకులతండాకు చెందిన ఓ మహిళ(24)కు వివాహం పేరిట మాయమాటలు చెప్పి మధ్యప్రదేశ్‌లో ఓ వ్యభిచార గృహం నిర్వహించే మహిళకు విక్రయించారు. అక్కడి దుర్భర పరిస్థితుల నుంచి తప్పించుకుని వచ్చిన ఆమె ఆసిఫాబాద్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ముఠా గుట్టు రట్టయ్యింది. బాధితురాలి ఫిర్యాదుతో మధ్యప్రదేశ్, ఆసిఫాబాద్‌కు చెందిన తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖలో పనిచేసే ఓ కానిస్టేబుల్ ఉన్నారు. అతడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. నిందితులు ఇచ్చిన సమాచారంతో ఓ ప్రత్యేక పోలీసు బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపినట్లు తెలిసింది. నిందితులపై ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు.. మరింత సమాచారం కోసం విచారిస్తున్నట్లు తెలుస్తోంది. నేడో, రేపో అరెస్టు చూపే అవకాశం ఉంది.

వెట్టి, వ్యభిచారం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నివసిస్తున్న ఏజెన్సీ మహిళలను కొందరు దళారులు టార్గెట్‌గా చేసుకుని మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఆకర్షణీయ రంగు, రూపం ఉన్న మహిళలను ఈ ఊబిలోకి దించుతున్నారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు చెందిన ప్రజలు, ప్రధానంగా మహిళలు మానవ అక్రమ రవాణాకు బలవుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన కొందరు పేదరికాన్ని భరించలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో వెట్టిచాకిరీ, వ్యభిచారం వైపు పయనిస్తున్నారు. ఇదే విధంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఏటా పదుల సంఖ్యలో బాలబాలికలు అదృశ్యమవుతున్నట్లు సమాచారం. అందులో చాలామంది ఆచూకీ శాశ్వతంగా దొరకడం లేదు. గతంలోనూ ఇలాంటి ముఠా గుట్టును జిల్లా పోలీసులు ఛేదించారు. అయితే నిందితుల్లో ఓ పోలీసు కానిస్టేబుల్ కూడా ఉండడం అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా పోలీసుల అదుపులో ఉన్న నిందితుల్లోనూ ఆ కానిస్టేబుల్ ఉండడం గమనార్హం. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న పాత నేరస్తులపై నిఘా లేకపోవడంతో మళ్లీ అదేబాట పడుతున్నట్లు తాజా అరెస్టులు చెబుతున్నాయి.

మధ్యప్రదేశ్‌కు ప్రత్యేక బృందం...

మానవ అక్రమ రవాణా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధ్యప్రదేశ్‌లో మన రాష్ట్రానికి చెందిన మరికొందరు మహిళలు ఈ ఊబిలో చిక్కుకున్నట్లు తెలిసింది. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ నుంచి ఓ ప్రత్యేక పోలీసు బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపినట్లు సమాచారం. అక్కడ ఉన్న బాధిత మహిళలను అక్రమార్కుల చెర నుంచి విడిపించేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. పదుల సంఖ్యలోనే బాధితులు అక్కడ ఉన్నట్లు తెలుస్తోంది. మానవ అక్రమ రవాణాలో సూత్రధారులు, పాత్రధారులను పట్టుకునే దిశగా దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం.

ఆసిఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు..

మహబూబాబాద్ జిల్లా రేకులతండాకు చెందిన మహిళను రెండేళ్ల కిందట ఆసిఫాబాద్‌కు చెందిన కొందరు దళారులు మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి విక్రయించినట్లు తెలిసింది. మహిళ తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి, డబ్బును ఎరగా చూపి పెళ్లి పేరిట ఆమెను బలవంతంగా మధ్యప్రదేశ్‌కు తరలించారు. ఆమెను తీసుకెళ్లిన వారు అక్కడ వ్యభిచార గృహం నిర్వహించే ఓ మహిళకు విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడ దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్న బాధితురాలు నెల కిందట తప్పించుకుని వచ్చి ఆసిఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన సమాచారంతో ఆసిఫాబాద్‌కు చెందిన మానవ అక్రమ రవాణా ముఠా విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆసిఫాబాద్‌కు చెందిన ఐదుగురు నిందితులతోపాటు మంచిర్యాల జిల్లా నీల్వాయికి చెందిన ఓ వ్యక్తిని, మధ్యప్రదేశ్‌కు చెందిన మరో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ గతంలో మానవ అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఓ మహిళతోపాటు పోలీసు కానిస్టేబుల్ కూడా ఉన్నారు. వీరితోపాటు రాజంపేటకు చెందిన మరో మహిళ, వాంకిడి మండలంలోని బెండార గ్రామానికి చెందిన మరో మహిళ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మంగళవారం పోలీసు కానిస్టేబుల్‌ను ఆసిఫాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ముద్దాయి ప్రస్తుతం అనారోగ్య కారణాలతో విధులకు సెలవు పెట్టాడు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాన్ని మంగళవారం తనిఖీ చేశారు. నిల్వలు, రశీదు పుస్తకాలు, రిజిస్టర్లు, ఎరువుల గోదాం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట ధరల పట్టిక, నిల్వ వివరాలు ప్రదర్శించాలని సూచించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలుకు సంబంధించిన రశీదులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ జాడి మిలింద్‌కుమార్, తహసీల్దార్ డి.కవిత తదితరులు ఉన్నారు.

టీజీ ఎండీసీ ద్వారా ఇసుక సేకరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు టీజీఎండీసీ ద్వారా ఇసుక సేకరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం వివిధశాఖల అధికారులతో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇసుక సేకరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం, భవన నిర్మాణాలు, వంతెనలు, కాలువలు, రహదారులు, సింగరేణి, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు టీజీ ఎండీసీ ద్వారా ఇసుక సేకరించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా ఇండెంట్లు సమర్పించాలని, జీవో పర్మిట్ ద్వారా క్వారీల నుంచి మెటల్ తరలించాలన్నారు. సమావేశంలో మైనింగ్‌శాఖ ఏడీ గంగాధర్‌రావు, పీవో రవీందర్, ఆర్అండ్‌బీ అధికారి సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, నీటిపారుదల శాఖ ఈఈలు గుణవంత్‌రావు, ప్రభాకర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా గుణాత్మక విద్య

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలు కలిగిన గుణాత్మక విద్య అందుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల (మంచిర్యాల)కు సంబంధించిన అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచిర్యాల జిల్లాకేంద్రంలో బాలికల కోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో వసతితో పాటు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రవేశాల కోసం 79950 10674 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, తదితరులు

సాగుకు సాయం

- అన్నదాతల ఖాతాల్లోకి 'రైతు భరోసా' నగదు
- కొత్తవారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 5లోగా పట్టాలు పొందిన రైతులు అర్హులు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



కౌటాల(సిర్పూర్): అన్నదాతలను సాగుపరంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతు భరోసా నగదును సోమవారం నుంచి వారి ఖాతాల్లో జమ చేస్తోంది. సేద్యాన్ని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం రైతుబంధు కింద సాయం అందించగా, ప్రస్తుత ప్రభుత్వం సైతం రైతుభరోసాగా పేరు మార్చింది. కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సైతం పెట్టుబడి సాయం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా సాయం ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. జిల్లాలో 1,30,435 మంది రైతులు అర్హులు కాగా.. రూ.2,25,92,03,601 నగదు చెల్లించనున్నారు

ఏటా రెండు పంటలకు..

జిల్లాలోని రైతులు వానాకాలం సుమారు 4.50 లక్షల ఎకరాల్లో పత్తి, కంది, వరి, పెసర, సోయా, జొన్న, మొక్కజొన్న పంటల సాగు చేస్తున్నారు. ఏటా రెండు పంటల కాలాలకు పెట్టుబడిగా ఎకరానికి రూ.6 వేల చొప్పున ప్రభుత్వం రైతు భరోసా సాయం అందిస్తోంది. ఈ సాయంతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందే ప్రవేశించడంతో రైతులు పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. పంటల సాగు సమయంలో ఖర్చుల కోసం డబ్బులు అవసరం పడనున్నాయి. 2025 జూన్ 5 నాటికి కొత్తగా పట్టాలు పొందిన రైతుల సాయం అందించడానికి వ్యవసాయాధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మరోవైపు చాలామంది పట్టాలు కలిగి ఉన్నవారు కూడా బ్యాంకు వివరాలు ఇవ్వడం లేదు. కొందరు ఇచ్చినా ఆధార్ వివరాలు తప్పుగా నమోదయ్యాయి. కొందరు వలస వెళ్లడం, మృతి చెందడం .. తదితర తప్పులు జరుగుతున్నాయి. ఇలాంటి వారి వివరాలు సైతం సేకరించాలని ప్రభుత్వం వ్యవసాయ అధికారులను ఆదేశించింది.

దరఖాస్తుల ఆహ్వానం

రెవెన్యూ శాఖలో భూ సమస్యలు పరిష్కరిస్తూ నిరంతరం పట్టా పాసుపుస్తకాలు జారీ చేస్తుంటారు. ఇలా జిల్లాలో జూన్ 5 వరకు పట్టాలు పొందిన వారు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 1,620 మంది రైతులు కొత్తగా పట్టాలు పొందినట్లు గుర్తించారు. అర్హులు బ్యాంకు ఖాతా, ఆధార్, పట్టా పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను ఈ నెల 20వ తేదీలోగా స్థానిక అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.


దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 20 లోగా సంబంధిత ఏఈవోలకు దరఖాస్తులు చేసుకోవాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు అందించాలి. ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

– పి.ప్రేమలత, ఏవో, కౌటాల

బడిలో వ్యాపారం!



కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంతో స్కూల్ యూనిఫాంలు అందించేలా ఒప్పందం కుదుర్చుకుంది. దుకాణంలో ఒక్కో యూనిఫాంకు విద్యార్థి నుంచి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. అధిక ధరలకు దుస్తులు అమ్ముతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు... జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ఇలా వివిధ షాపుల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని యూనిఫాం, స్కూల్ సామగ్రి కొనుగోలు చేసేలా ఒత్తిడి తెస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

- ప్రైవేట్ పాఠశాలల్లో అమలు కాని నిబంధనలు
- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు
- వివిధ రకాల ఫీజులతో తల్లిదండ్రులపై భారం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదు. వివిధ రకాల ఫీజులతో తల్లిదండ్రులపై భారం మోపుతుండగా, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు, ఇతర సామగ్రిని యథేచ్ఛగా అధిక ధరలకు అమ్ముతున్నాయి. ఏటా స్కూల్ ఫీజులు 25 నుంచి 30 శాతం వరకు పెంచుకుంటున్నారు. ప్రాథమిక విద్యకే రూ.25 వేలకు మించి వార్షిక ఫీజు వసూలు చేస్తుండగా, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు ఏడాదికి సంబంధించిన ఫీజు మొత్తం ఒకేసారి తీసుకుంటున్నారు. చిన్నపిల్లలు మధ్యలోనే స్కూల్ మానేసినా డబ్బులు తల్లిదండ్రులకు వెనక్కి ఇవ్వడం లేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు.

జిల్లాలో 110 ప్రైవేట్ స్కూళ్లు..

జిల్లాలో మొత్తం 110 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. విద్యా సంస్థలు చదువు, జ్ఞానం అందించే క్షేత్రాలు ఉండాలని, పుస్తకాలు, పెన్నులు, దుస్తులు విక్రయించే దుకాణాలు మారొద్దని విద్యావేత్తలు చెబుతుంటారు. దీనికి విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు కౌంటర్లు పెట్టి మరీ విక్రయిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో ప్రైవేట్ షాపుల యజమానుల నుంచి కమీషన్లు తీసుకుని పిల్లలకు యూనిఫాం, బుక్స్ అక్కడే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు వసూలు చేయొద్దు. కానీ జిల్లాలో రూ.1000 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించి ఉచితంగా విద్య అందించాలనే నిబంధన ఉంది. జిల్లాలో ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవు. పాఠశాలలకు సంబంధించిన ప్రధానమైన విషయాలను జీవో ఎంఎస్ నంబర్ 1లో పొందుపర్చారు. కానీ అది అమలుకు నోచుకోవడం లేదు. శానిటేషన్, అగ్ని ప్రమాదాలు నివారణకు ఫైర్ సేఫ్టీ, అద్దె భవనాలైతే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ప్రభుత్వ గుర్తింపు తేదీ పూర్తయితే రెన్యూవల్ చేసుకోవడం, స్కూల్ బస్సులు కండీషన్ ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకోవడం తదితర అంశాలు ఈ జీవోలో పొందుపర్చారు. జిల్లాలో ఏ ప్రైవేట్ స్కూల్ కూడా పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలి



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. పాఠశాల నోటీస్ బోర్డులో ఫీజుల వివరాలు ఉంచాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలి. ప్రైవేట్ స్కూళ్లలో టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్ అమ్మితే యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– యాదయ్య, డీఈవో

ఫీజులు కట్టడి చేయాలి



ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఈ ఏడాది ఫీజులు భారీగా పెంచారు. సంబంధిత అధికారులు ఫీజులు కట్టడి చేయాలి. తల్లిదండ్రులపై యాజమాన్యాలు భారం మోపుతున్నాయి. విద్యాశాఖ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

గిరిజనులకు సంక్షేమ పథకాలు

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్(పీఎం జుగా) ద్వారా గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించనున్నట్లు ఏటీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దేవాపూర్ గ్రామంలో భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గిరిజన గౌరవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఎం జుగా ద్వారా అన్నిరకాల మౌలిక సదుపాయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్‌పీ రాథోడ్ నరేశ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల వివాహాలకు ఆర్థిక ప్రోత్సాహకం

ఆసిఫాబాద్‌అర్బన్: ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే ప్రభుత్వం రూ.లక్ష ప్రోత్సాహకం అందిస్తుందని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సాధారణ వ్యక్తి దివ్యాంగులను వివాహం చేసుకుంటే పథకం వర్తించేదని, ప్రస్తుతం ప్రభుత్వం నిబంధనల్లో మార్పు చేసిందని పేర్కొన్నారు. ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకున్నా పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లునిండి వివాహం చేసుకున్న దివ్యాంగులు పోర్టల్ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణంలో మహారాష్ట్ర మద్యం



మద్యం చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ రంగస్వామి

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో గల హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణంలో 27 లీటర్ల మహారాష్ట్ర మద్యం లభ్యమైందని ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా 25 మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని ఫర్టిలైజర్ దుకాణ యజమాని గంగని రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి నిర్మల్ కోర్టు జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం నిలాయిపేటకు చెందిన దేగవత్ శంకర్ అడవి జంతువులు వస్తున్నాయని తన మొక్కజొన్న చేను చుట్టూ జియో వైరు చుట్టించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. అటుగా వెళ్లిన భూమేశ్ విద్యుత్ వైరుకు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా జడ్జి శ్రీవాణి మంగళవారం నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో ఒకరికి..

దహెగాం: యువతి ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడిన యువకునికి కోర్టు నాలుగేళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గందం సాయికుమార్ తన ఫోన్‌లో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించగా యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2020 మార్చి 6న అప్పటి ఏఎస్సై ఓంపాల్ పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి ఎంపీ రమేశ్ పైవిధంగా తీర్పునిచ్చారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

కైలాస్‌నగర్: జాతీయస్థాయి అధికారుల బృందం ఈ నెల 18 నుంచి 21 వరకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పర్యటించనుంది. ఢిల్లీకి చెందిన పి.కిరణ్ చరణ్, ఎస్.రఘు కుమార్‌లతో కూడిన అధికారుల బృందం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనుండగా అవనీంద్రకుమార్ బృందం నిర్మల్ జిల్లాలో పర్యటిస్తుంది. ఆయా జిల్లాల్లోని వివిధ మండలాల్లో ఆకస్మిక పర్యటనలు చేయనున్నారు. సదరు అధికారుల బృందం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల ప్రగతిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనుంది. కలెక్టర్లతో సమావేశమైన అనంతరం క్షేత్రస్థాయిలో పనుల తీరును పరిశీలిస్తారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం నివేదికను కేంద్రానికి అందించనుండటంతో ఈ కమిటీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

అడ్రస్ లేని అత్యవసర సేవలు

- పుణ్యక్షేత్రం, ట్రిపుల్ ఐటీ ఇక్కడే..
- రైలు, బస్సు మార్గంలో నిత్యం వందల మంది రాకపోకలు
- అయినా ఎమర్జెన్సీ సేవల కల్పనపై నిర్లక్ష్యం
- గోదావరిలో కానరాని రెస్క్యూ టీం
- వైద్యం కోసం 30 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిందే..
- ఇదీ బాసరలో పరిస్థితి



బాసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భైంసా: అమ్మ చెంత అత్యవసర సేవలు అందడం లేదు. ఆదివారం జరిగిన సంఘటనలో ఐదుగురు యువకులు గోదావరిలో నీట మునిగి మృత్యువాత పడ్డారు. బాసరలో ఏ సంఘటన జరిగినా అత్యవసర వైద్యసేవలు అందే పరిస్థితి లేదు. పక్క జిల్లా నిజామాబాద్ వెళ్లాలన్నా 31 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. భైంసాకు రావాలన్నా 32 కిలోమీటర్లు ప్రయాణం చేయకతప్పదు. బాసర రెండు జిల్లాలకు సరిహద్దు. తెలంగాణ మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు కూడా. సరిహద్దులో ఉన్న బాసరలో అత్యవసర వైద్యసేవలు అందించే విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రసిద్ధిగాంచిన ఆలయం..

దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఆలయం బాసరలో ఉంది. పిల్లల అక్షరాభ్యాసానికి దేశ నలుమూలల నుంచి అనునిత్యం భక్తులు ఈ ఆలయానికి వస్తూనే ఉంటారు. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటారు. సరస్వతీ అమ్మవారిచెంత తమపిల్లల నామకరణాలు, పుట్టుపంచలు, శుభకార్యాలు జరిపిస్తారు. జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుభకార్యాలు చేయించుకోవడం భక్తులు తమ అదృష్టంగా భావిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు చేసేందుకు ఇక్కడికే వస్తారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గామాతలను కూడా బాసర గోదావరినదిలోనే నిమజ్జనం చేస్తారు.

రెస్క్యూటీం లేదు...

బాసర ఆలయంలో ఇప్పటికీ రెస్క్యూటీం లేదు. ప్రమాదాలు సంభవిస్తే కాపాడే ఒక్క టీం కూడా అందుబాటులో లేదు. ఆలయానికి వచ్చే భక్తులు, గోదావరి నది నీటిలో చిక్కుకున్న సందర్భంలో ప్రాణాలే పోతున్నాయి. బాసర వచ్చే పర్యాటకులకు భరోసా కల్పించలేకపోతున్నారు.

ఆస్పత్రి నిర్మిస్తే...

భైంసా పట్టణంలాగే బాసరలోనూ 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని ఎన్నో రోజులుగా ఆ ప్రాంత వాసులు విన్నవిస్తున్నారు. 100 పడకల ఆసుపత్రి ఉంటే ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు, బాసర మండల వాసులకు, భక్తులకు, రైల్వే యాత్రికులకు నిరంతరం వైద్య సేవలు అందుతాయి. ఆపద సమయంలో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. బాసరను కలుపుతూ ధర్మాబాద్ మీదుగా నాందేడ్ వరకు ఒకహైవే, బిలోలిని కలుపుతు దెగ్లూర్ వరకు మరోహైవే, భైంసా పట్టణం గుండా నిర్మల్–లక్సెట్టిపేట్ కలుపుతూ హైవేలు ఉన్నాయి. బాసర మీదుగా నిజామాబాద్‌కు ప్రధాన రోడ్డు మార్గం ఉంది. తాజాగా బోధన్ పట్టణం మీదుగా జహీరాబాద్, మెదక్‌లను కలుపుతూ హైదరాబాద్ వరకు మరోహైవే నిర్మాణంలో ఉంది. ఇన్ని ప్రధాన రహదారులను కలిపే బాసరలో అత్యవసర సేవలపై దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

నిఘా కరువు..

బాసర రైల్వే స్టేషన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దొంగలు భక్తుల జేబులు కత్తిరిస్తున్నారు. మెడలో బంగారు ఆభరణాలు చోరీకి గురవుతున్నాయి. రైలుమార్గం ద్వారా మహారాష్ట్ర నుంచి గంజాయి, దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. నిఘా వ్యవస్థ పటిష్టం చేస్తే ఇలాంటి వాటిని కట్టుదిట్టం చేయవచ్చు. దేశవ్యాప్తంగా వచ్చే భక్తులకు భరోసా ఇచ్చేలా బాసరలో నిఘా వ్యవస్థ పటిష్టం చేసి, ఆస్పత్రిని నిర్మించి, ఆపద సమయంలో ఆదుకునేలా రెస్క్యూ బృందం అందుబాటులో ఉండేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ట్రిపుల్‌ఐటీ, రైలు మార్గం...

రైలు మార్గం ద్వారా అనేక మంది యాత్రికులు బాసరకు రాకపోకలు చేస్తారు. 9 వేల మంది విద్యార్థులు ఇక్కడి ట్రిపుల్‌ఐటీలోనే చదువుతుంటారు. వేలాది మంది రాకపోకలతో నిత్యం జనంతో రద్దీగా ఉండే బాసర మండల కేంద్రంలో అత్యవసర సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినా, పాముకాటుకు గురైనా, స్నానఘట్టాలపై భక్తులు నీటిలో జారిపడినా, రైల్వే ప్లాట్‌ఫాంపై కిందపడ్డా ఇక్కడ వైద్య సేవలు అందవు. బాసరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉంది. ఆలయానికి వయస్సు పైబడినవారు వచ్చి అస్వస్థతకు గురైతే వైద్య సేవలు అందే పరిస్థితిలేదు.

పీఈసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సక్కు



తరంగిణి



రాణి

ఆదిలాబాద్: ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పీఈ సెట్) ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హరి గ్రామానికి చెందిన పెందూర్ సక్కు రాష్ట్ర స్థాయిలో 22వ ర్యాంకు, నిర్మల్ జిల్లా ముధోల్ మండలం బ్రహ్మగావ్ గ్రామానికి చెందిన దేవుగొండ తరంగిణి 87వ ర్యాంకు, కుభీర్ మండలం బ్రహ్మేశ్వర్ గ్రామానికి చెందిన నూనావత్ రాణి 101 ర్యాంకులతో సత్తా చాటారు. వీరంతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వీజీఎస్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఉట్నూర్‌రూరల్: ఈ నెల 12న పిడుగుపాటుతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేయనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాదిగూడ మండలం పిప్రి గ్రామానికి చెందిన రంభాబాయి, పెందూర్ సంజన, మంగం భీంబాయి, పెందూర్ మాధవ్‌రావు, బేల మండలంలోని కోవ సునీత, నందిని కుటుంబ సభ్యులకు రూ.25 వేల చొప్పున మంజూరైనట్లు పీవో పేర్కొన్నారు.

మాటల్లో పెట్టి.. మట్టి చేతిలో పెట్టారు..!

- రెండు తులాల బంగారం అపహరించిన కేటుగాళ్లు



మోసపోయిన రాజవ్వ

భైంసాటౌన్: పట్టణంలోని బంధువుల ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధ దంపతులను అధికారులమని నమ్మించి వారి వద్ద ఉన్న బంగారంతో ఉడాయించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు కుంటాల మండలం అంబకంటికి చెందిన రాజవ్వ, గోవింద్ భైంసాలోని పిప్రికాలనీలో ఉన్న బంధువుల ఇంటికి బస్సులో బయలుదేరారు. పిప్రికాలనీ బస్టాప్ వద్ద దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వారిని బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు తాము అధికారులమని పరిచయం చేసుకున్నారు. ఇటీవల దొంగతనాలు ఎక్కువయ్యాయని, ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసి జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. దుండగుల్లో ఒకరు తన ఒంటిపై ఉన్న చైన్, ఉంగరాలు తీసి మిగతా ఇద్దరికి ఇవ్వగా వారు పేపర్ పొట్లం ప్యాక్ చేసి ఇచ్చినట్లు నటించారు. వారిని నమ్మిన రాజవ్వ సైతం తన ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు గొలుసు తీసి సంచిలో పెట్టుకుంటుండగా, వారిలో ఒకడు తాను పేపర్‌లో పొట్లం కట్టిస్తానని తీసుకున్నాడు. వారిని మాటల్లో పెట్టి వారి వద్ద ఇదివరకే ఉన్న మరో పొట్లం రాజవ్వకు ఇచ్చారు. కొద్దిసేపటికి వారు బైక్‌పై వెళ్లిపోయారు. కొద్దిదూరం వెళ్లిన తరువాత రాజవ్వ పొట్లం విప్పి చూడగా అందులో మట్టి, చిన్నపాటి కంకర కనిపించడంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు.

మహిళను బురిడీ కొట్టించి గొలుసు అపహరణ

నిర్మల్‌టౌన్: మహిళను బురిడీ కొట్టించి రెండు తులాల గొలుసు అపహరించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు శాస్త్రినగర్ కాలనీకి చెందిన లక్ష్మి అదే కాలనీలో నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించారు. పోలీసులమని పరిచయం చేసుకున్నారు. చోరీలు అధికంగా జరుగుతున్నాయని, మెడలో ఉన్న బంగారు గొలుసు తీసి సంచిలో పెట్టుకోవాలని సూచించారు. ఆమె చైన్ తీసిఇవ్వగా పేపర్లో కట్టి ఇస్తామని చెప్పి వారు ముందుగా సిద్ధం చేసి ఉంచుకున్న మట్టిపెట్టిన కవర్లు ఆమెకు ఇచ్చారు. ఇంటికి వెళ్లిన మహిళ పొట్లం తీసి చూడగా చైన్‌కు బదులు చిన్నచిన్న రాళ్లు కనిపించాయి. వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

భయంగుప్పిట్లో మనోళ్లు..?

- ఇజ్రాయెల్ దేశంలో ఉమ్మడిజిల్లా వాసుల భయాందోళనలు
- యుద్ధ వాతావరణంతో కుటుంబ సభ్యుల్లో అలజడి
- బంకర్లలో తలదాచుకుంటున్నట్లు వెల్లడి..



హెల్మెట్ ధరించి విధులకు వెళ్తున్న సారంగధర్

నిర్మల్‌ఖిల్లా: ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య కొన్నిరోజులుగా దాడులు, ప్రతిదాడులతో భయానక యుద్ధ వాతావరణం నెలకొంటోంది. తెలంగాణ ప్రాంతంవారు అధిక సంఖ్యలో ఉన్న టెల్అవీవ్ ప్రాంతం అట్టుడికిపోతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లినవారు ఎలా ఉన్నారోనని బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. రాకెట్లు, లాంచర్ల దాడిలో వందలాది మంది మృతి చెందుతున్నట్లు ప్రసార మాధ్యమాల్లో సమాచారం వెలువడుతున్న దృష్ట్యా ఇక్కడి ప్రవాస భారతీయ కుటుంబ సభ్యుల్లో అలజడి చెలరేగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్, నిర్మల్, భైంసా, ఆదిలాబాద్, మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి ఆయా దేశాలకు వెళ్లిన 500 మందికి పైగా పారిశ్రామిక, నిర్మాణ తదితర రంగాల్లో ఉపాధి పొందుతున్నట్లు సమాచారం. వారంతా దాడులు జరుగుతున్న ప్రాంతంలో వివిధ ప్రాంతాలలో పనులు నిర్వర్తిస్తున్నారు.

బాంబుదాడులతో భయాందోళన

ఉపాధి నిమిత్తం వెళ్లిన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కంకెట గ్రామానికి చెందిన పుప్పుర్ సారంగధర్ 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడి పరిస్థితిని వివరిస్తూ ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారంతా క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. ఆకస్మిక దాడులతో ఇజ్రాయెల్ దేశంలోని మన పౌరులు ఉలిక్కిపాటుకు గురవుతున్న మాట వాస్తవమేనన్నారు. మూడు, నాలుగు రోజులుగా బాంబుదాడులు కొనసాగుతున్న నేపథ్యంలో తమ బృందం బంకర్లలో తలదాచుకుంటున్నట్లు వివరించారు. యుద్ధ సైరన్ మోగగానే కార్మికుల బృందం బంకర్‌లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఏదైనా యుద్ధ రాకెట్, మిస్సైల్ వంటివి దూసుకొస్తున్న కొద్ది నిమిషాల ముందు సైరన్ మోగుతుందని, వెంటనే అక్కడి సమీప ప్రాంతవాసులంతా అప్రమత్తం కావాల్సి ఉంటుందన్నారు. తాము నివసించే ప్రతీ అపార్ట్‌మెంట్‌నందు యుద్ధ సమయంలో సురక్షితంగా తలదాచుకునేందుకు బంకర్ సదుపాయం ఉంటుందని, ప్రస్తుతం వాటిని వినియోగించుకుంటూ క్షేమంగానే ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ బంకర్ల సదుపాయం అన్నిచోట్ల లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లోని వారికి ప్రమాదం పొంచిఉండే అవకాశం ఉంటుందన్నారు. కార్మికులు పని చేసే సగటు రోజుల సంఖ్య ఏడు నుంచి నాలుగుకు తగ్గింది. కూరగాయలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 30వరకు దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించినట్లు తెలిపారు. విమానాశ్రయాలు సైతం మూతపడటంతో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెద్దబుచ్చ గ్రామ శివారులో తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, మండల వ్యవసాయాధికారి ప్రేమ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన మాకినేని వెంకటనారాయణ ఇంట్లో తనిఖీ చేయగా 25 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడినట్లు తెలిపారు. వాటి విలువ రూ.90 వేల వరకు ఉంటుందన్నారు. చిలకలూరిపేటకు చెందిన జగన్ వద్దనుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. విత్తనాలను సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



ఈరన్న (ఫైల్)

భైంసారూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కూనేరు ఈరన్న (35) కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువతి..



గౌరి (ఫైల్)

పెంబి: మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల మేరకు గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన దాత్తురోళ్ల పోశెట్టి–నర్సవ్వ దంపతుల కుమార్తె గౌరి(22) ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో మందలించారు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్సెట్టిపేట: ఒంటరితనం భరించలేక ఏప్రిల్ 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తైపు బుచ్చయ్య (49) భార్య గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. కూతురుకు ఇటీవల వివాహం చేసి అత్తారింటికి పంపించాడు. ఒంటరితనం భరించలేక ఏప్రిల్ 30న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించారు. గత నెల 31న ఆరోగ్యం క్షీణించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోటపల్లి: మండలంలోని పంగిడి సోమారం అటవీ ప్రాంతంలో ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అద్దరపల్లి అశోక్ (25) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ద్విచక్ర వాహనం అ దుపుతప్పి కిందపడడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. నెన్నల మండలం ఖర్జీకి చెందిన అశోక్ కోటపల్లి అటవీశాఖలో బేస్‌క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

నగల బ్యాగు అప్పగింత

మంచిర్యాలక్రైం: రైల్లో నగలు బ్యాగు మర్చిపోయిన ప్రయాణికుడికి మంచిర్యాల జీఆర్‌పీ పోలీసులు బ్యాగును అందించి నిజాయతీ చాటుకున్నారు. లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన వంశీకృష్ణ మంగళవారం కుటుంబంతో కలిసి విజయవాడ నుంచి జీటీ ఎక్స్‌ప్రెస్‌లో మంచిర్యాలకు వచ్చాడు. స్టేషన్‌లో దిగి నగల బ్యాగును రైలులో మర్చిపోయాడు. జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదే రైలులో ప్రయాణిస్తున్న జీఆర్‌పీ పోలీసు శ్రీనుకు సమాచారం అందించారు. అతని ద్వారా బ్యాగును మంచిర్యాల జీఆర్‌పీ పోలీసులకు అందజేశాడు. అనంతరం నగల బ్యాగును స్థానిక జీఆర్‌పీ పోలీసులు వంశీకృష్ణకు అందజేశారు. బ్యాగులో 10 తులాల బంగారం, వెండి ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు.

చోరీకి యత్నించిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలో గల ఓ ఇంట్లో చోరీకి యత్నించిన చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. నిందితుడు ఇటీవల చౌడేశ్వరి మాతా ఆలయంలో చోరీకి పాల్పడిన మరుసటి రోజు దొంగతనానికి యత్నించాడు. కాగా ఇటీవల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి బెయిల్ మంజూరు చేశారు. దొంగతనానికి యత్నించిన కేసులో మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నజియా బేగం ఇంట్లో చోరీకి పాల్పడిన ఆసిఫ్ ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 10న నజియా బేగం మహారాష్ట్రలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రూ.12వేల నగదు అపహరణకు గురికాగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు వినాయక్‌చౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి తరలిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మహ్మద్‌సామీరుద్దీన్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మహ్మద్ సామీరుద్దీన్ ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్ కాలనీకి వెళ్తుండగా అతన్ని ఆపి తనిఖీ చేయగా 262 గ్రాముల గంజాయి లభ్యమైంది. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. సామీరుద్దీన్‌కు గంజాయి విక్రయించిన ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన షెరూ పరారీలో ఉన్నాడని తెలిపారు.

భూకబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జాకు పాల్పడిన ఐదుగురు ముఠా సభ్యులపై కేసు నమోదు కాగా ఏడాది నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడు షేక్ అర్బాజ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. 1970లో రాష్ట్ర ప్రభుత్వం కైలాస్‌నగర్‌లో 20 ఎకరాల స్థలాన్ని నాన్ గెజిటెడ్ అధికారులకు సొసైటీ కోసం కేటాయించగా 1977లో 225 ప్లాట్‌లుగా విభజించి సభ్యులకు కేటాయించారు. అందులో 8 ప్లాట్లను సొసైటీ సభ్యులు ప్రాంత అభివృద్ధి, పార్కు, ఇతర అవసరాల కోసం వదిలేశారు. అయితే ఇందులోని రెండు ప్లాట్లను కబ్జా చేసేందుకు షేక్ అర్బజ్, షేక్ సమీ, సయ్యద్ ఇమ్రాన్, పర్వీన్ బేగం, షేక్ నూర్జహాన్ నకిలీ పత్రాలు సృష్టించారు. ఇదిలా ఉండగా ప్రధాన నిందితుడు షేక్ అర్బాజ్‌ను దస్నాపూర్ వద్ద మావల ఎస్సై ముజాహిద్ అరెస్టు చేసినట్లు వివరించారు. షేక్ అర్బాజ్ 2002లో సొసైటీలోని 4, 5 నంబర్లు గల రెండు ప్లాట్లు కబ్జా చేసేందుకు తహసీల్దార్ జారీ చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించాడు. వీటి ఆధారంగా మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు తీసుకుని వాటికి ఓపెన్ ప్లాట్ ట్యాక్స్ చెల్లిస్తున్నాడు. మొదట సయ్యద్ షమీ, పర్వీన్ బేగంలపేరిట రెండు ప్లాట్లకు సంబంధించిన నకిలీ పత్రాలను సృష్టించాడు. తన ముఠా సభ్యులైన సయ్యద్ ఇమ్రాన్, షేక్ నూర్జహాన్‌లపై సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిపై 2024లో సొసైటీ సభ్యుడు లోక ప్రవీణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. ఇదివరకే షేక్ అర్బాజ్‌పై వివిధ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొడ్డల శ్రీనివాస్ అనే వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించి సర్వే నం.68లో భూ ఆక్రమణలు చేయడంతో సోమవారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

బాసర: బాసర గోదావరి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల గోదావరి వద్ద ఐదుగురు యువకులు మృతి చెందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి పుష్కర ఘాట్ నుంచి రెండో పుష్కర ఘాట్ వరకు మెట్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి క్లోరినేషన్ చేయించారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు నదిలోపలికి వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులను, నీటిలో ఇరువైపులా జాలీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో ఆర్డీవో సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో అశోక్ కుమార్, ఎస్సై శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణ అధికారి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరుగుల వరద

- అండర్ 19 క్రికెట్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు రాణింపు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 జిల్లా జట్టు ఎంపిక కోసం నిర్వహిస్తున్న పోటీలు మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరగ్గా బ్యాటింగ్‌తో పాటు, బౌలింగ్‌లో పలువురు రాణించారు. గ్రీన్, బ్లూ జట్ల మధ్య జరిగిన 50ఓవర్ల మ్యాచ్‌లో గ్రీన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ చేయగా 8వికెట్ల నష్టానికి 247పరుగులు చేసింది. గ్రీన్ జట్టులో సింహాద్రి బ్యాటింగ్‌లో రాణించి 113పరుగులు చేయడంతో పాటు, బౌలింగ్‌లోనూ మెరిసి 5వికెట్లు తీశాడు. బ్లూ జట్టు బౌలర్ నితిన్ వరుసగా మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. అనంతరం బ్లూ జట్టు 46.2ఓవర్లలో లక్ష్యఛేదన చేయలేక 218పరుగులకే ఆలౌట్ అయ్యింది.



సింహాద్రి (113 పరుగులు, 5 వికెట్లు)



నితిన్ (హ్యాట్రిక్ వికెట్లు)